# ఆవిడగారి ఆయన

చేసేది తాలూకా ఆఫీసు గుమాస్తాగిరీ అయినప్పటికీ నేను సంపూర్ణంగా స్వతంత్ర వాయువులను పీల్చుకోడానికి ఇండియాకు పరతంత్రం పోవనప్పటి నుంచీ అలవాటుపడ్డాను.

నాకు ఊహ తెలియని రోజుల్లో ఎలా వుండేవాణ్నోకాని — ప్రపంచ నాటక రంగంలో నాపాత్రను అర్థం చేసుకొని జ్ఞాపకం ఉంచుకోవటం ప్రారంభమయింది లగాయితూ ఈ ఈ ఘటం ఒకళ్ల చెప్పుచేతులలోనూ—ఒకళ్లకు వినయ విధేయులతోనూ ప్రవర్తించి ఎరగనని ఘంటాపథంగా చెప్పగలను.

చదువు మానెయ్యడం లగాయతు—ఉద్యోగం చెయ్యడం—మా ఆవిణ్ణి వరించడం—యిప్పుడు ఇలా బ్రతకటం వగైరా అన్ని సందర్భాలలోనూ నేను ఇంతవరకూ ఎవర్నీ "ఏమిటి? ఏంచెయ్యాలి అని అడుగలేదు—ఒకళ్ల మాట వినాలేదు.

అందుకే కాబోసు — నేను వుద్యోగంలో ప్రవేశించి రమారమి ఒకటిన్నర దశాబ్దాలు పూర్తయినప్పటికీ మన సీటు—మన ఫైళ్లు మన్నే అంటిపెట్టుకున్నాయి. ఒకరకంగా చూడొస్తే వాటికి నాకు బలీయమైన ఆత్మీయత—విడదీయలేని ఏకత్వం ఏర్పడ్డాయి....

నీకు కాలం చెల్లిపోయింది. ఉద్యోగంలోకి పనికిరావు—నీకు ఫింఛనీ యిచ్చేస్తాం అని నన్ను ప్రభుత్వంవారు బలవంతాన బయటకు పంపేస్తే తప్ప—నా సీటునూ—నా ఫైయిళ్లను నేను వదిలిపెట్టలేను—వదిలిపెట్టను.....

ఈ నా గుణగణాలను అవగాహన చేసుకొన్న కొందరు ఆత్మీయులు నామీద ఎటువంటి అభిప్రాయాలు వున్నప్పటికీ కొందరు కొందరకు మాత్రం నేను బాగా ఆత్మీయుణ్ణయ్యాను— అవడమే కాదు, వారికి నేనెలాగో నాకువారు అల్లాఅయ్యారు. అయిన వారిలో ఎందరో కొందరు కేవలం వాస్పజాతి జనాభాయే కాకుండా ఇతరత్రా రకరకాల వృత్తులలోనూ, వ్యాపారాల్లోనూ కీర్తికాంతనూ—శ్రీకాంతను— చేపట్టిన మిత్రరత్నాలు కూడా వున్నారు.

ఇత్యాదుల్లో చెప్పుకోదగినవాడు మాసుంద్రావుగారు — — ఒహరు—

సుందర్రావుగారు చేస్తోన్నది మాంఛి వుద్యోగమే ... అంటే ఊళ్లో సభలూ—సమావేశాలూ పార్టీలు జరిగేటప్పుడు ఆయనకి స్వంతపేరూ—తరహాలతో ఒక ఆహ్వానం వస్తుందన్నమాట.

మొట్టమొదటగానేను ఆయన బంట్రోతును కలుసుకున్నాను ... అంటే ఆయనగారి బంట్రోతు వచ్చి నన్ను కలుసుకున్నాడు .. .అన్నమాట.

"ఎందుకు?"

పిత్రీయం బాపతు అంతా మా పెద్దలచేతుల్లోనే హరించుకుపోగా మిగిలిన సశేషవిశేషం మనకీ ఒక్కగాని ఒక్క కొంప.....

మా యింటికి సిల్వరు జూబిలియా — డైమండు జ్యూబిలియా? .... డెబ్భై సంవత్సరాలకు చేసేది? ఆదేదో అయిపోయేవుంటుంది ఏనాడో .... కాని ప్రతిసంవత్సరం నాస్వశక్త్యానుసారం మావూళ్లో యింకా మునిసిపల్ దేవతా ప్రవేశం కాకపోవడం వల్ల దానిమీద వచ్చే అద్దె డబ్బుల్లో ఇతోధికభాగం దాని బాగోగులమీదనే ఖర్చు చేయడం మూలంగా ఇంకా కొంతవరకు వృద్ధాప్యం దూరంగానే వుంది.

మావూరుకు ఎవరైనా గెజెటెడ్ ఆఫీసర్లు (ఉన్నవాళ్లో అరడజనే లెండి) ట్రాంసఫరయి వస్తే వాళ్లకు బంట్రోతులు చెప్పే అయిదారు కొంపల్లోనూ నాదొకటి.

నాకుటుంబం కూడా ఆయింట్లోనే వుంటూన్నప్పటికీ — ఒకభాగం ఏపెద్ద ఆఫీసరుకయినా అవసరమయిన హంగులన్నిటితోనూ విరాజమానం అవుతోంది ....

కాబట్టి చెప్పొచ్చే మాట ఏమంటే. బంట్రోతుద్వారా సుందర్రావుగారు మాయిల్లు చూసుకొని వారం రోజులు తిరగకుండా కుటుంబాన్ని రప్పించుకొని మాయింట్లో దిగిపోయారు.

చెప్పొద్దూ — ఆయన ఎలా ఫీలయ్యారో ఏమో ప్రవేశించిన రెండునెలలదాకా వారు నాతో మాట్లాడలేదు. నేనూ వారితో అంతే.

మొదటినుంచీ నేను ఈవూరుకు ఆవూరు, ఎంతో ఆవూరికి ఈవూరూ ... అంతేగాణ్ణి. . పాపం బంట్రోతుచేత రెండో తారీఖు ఉదయమే అద్దె డబ్బు పంపించేసేవారు ...నేనూ ఒక రశీదు ముక్కరాసేసి వాడికే యిచ్చేసేవాణ్ణి.

ఇలా వుండగా!

ఒకానొక దినం ఆదివారం అయింది. సుందర్రావుగారు మాయింట్లో ప్రవేశించాక చాలా ఆదివారాలొచ్చి చల్లగా — మెల్లగా — హడావిడిగా — ఆహ్లాదంగా — కొండొకచో — వికటంగా — విచారంగా చిత్తగించాయి.

వాటన్నిటికన్న మన ఈ ఆదివారానికి ప్రత్యేకత వుంది కనుకనే ఆదిలో తమని ఈ ఆదివారం విషయం చిత్తగించ వలసిందిగా మనవి చేసుకున్నాను.

సరా.....!..... ఏతా వాతా ఏం జరిగిందీ అంటే ఆ ఆదివారానికి ముందు రోజునే అంటే శనివారంనాడు మా కుటుంబంది. పుట్టింటికి వేంచెయ్యడమూ అమ్మగా మిగిలిన కాశ్మీర ఖండంపు కేదారం బాపతు శిస్తు అనబడే పదార్థం రెండు "6 X 4" కాగితాల రూపంలో అస్మత్హస్త పద్మాలను తరింపజేయడం జరిగింది.

మధ్యాహ్నం స్వయంపాకం దేవతార్చనచేసి మాగన్నుగా మంచంమీద నడుం వాల్చిన మనం పేపరు కుర్రాడి సింహనాదంతోటి భువిమీదకు విచ్చేసి తలుపు తెరచుకొని వరాండాలోకి విచ్చేశాను.

నా తెలుగు పేపరు తీసుకొని నేను మళ్లీ యధాపూర్వకంగా లోపలకి పోతోంటే....... ఏమండీ — మీ ఆయన — క్యాంపులో వున్నారా? వూళ్లోనే వున్నారా?" అన్నారు — సుందర్రావుగారు.

ఈ అనుకోని సుందర్రావుగారి పలకరింపు నన్ను ఒక్కసారిగా ఉక్కిరి బిక్కిరి చేసింది —. ప్రక్కను చైను స్మోకర్ను కూర్చోబెట్టుకున్నట్లు — ఇంతటి హాస్యం — ఇంతటి కలుపుగోరుతనం వున్న మానవుడు యిన్నినాళ్లూ నాయింటి భాగంలో వుండికూడా ఒక్కనాడూ బుర్రెత్తి పలకరించకపోవడం — ఇప్పుడు అమాంతంగా అన్నపాసననాడే ఆవకాయ అన్నం వ్యవహారంలాగా — యుగయుగాలనాటి నుంచీ విడదీయలేని అనుబంధం వున్న వ్యక్తిలాగ, మాట్లాడడం చూడొస్తే నన్ను — నేను నమ్మలేకపోయాను — నన్ను కాదేమో — అనుకుంటే ఆ పరిసర ప్రాంతాల్లో మూడో నరమానవ సంచారం ఏమీ లేకపోయె.....

అప్పటికీ — ఎందుకేనా మంచిదని.

"ఏమండీ.... మా తాసిల్దారుగారేనాండి" అన్నాను.

"లేకపోతే.... మిమ్మల్ని గవర్నరుగారి గురించి అడుగుతానేంటి"!

"మా ఆయన వూళ్లో వుంటే మేం యిలా వుంటామా" — ఆదివారం లేదు — సోమవారం లేదు — అన్నా — తెగించి కొంచెం

కొత్తపల్లి సుబ్రహ్మణ్యం

చనువుగానే....

వూళ్లో స్త్రీకు వ్యవహారం ఏమనుకుంటున్నారు''.... ప్రశ్నించరు. మా కులం వాళ్ల వ్యవహారం మాకు తెలియకుండా వుంటుందా... అని.

ఏమోనండి — నాకంతగా ఆ వ్యవహారాల్లో జోక్యం లేదు సార్ — ఏదో నామూలాన నేను పోవడమేగాని. అయినా మమ్మల్ని చూసి వీళ్లు బుద్ధితెచ్చుకోవలసుండేది సార్, ఉదాహరణకి కావలసొస్తే వేం రిటైరయ్యేనాటిక్కూడా పోస్టుమేన్ స్టార్టింగు స్కేలుకు రీచవ్వం....

''ఓ బేస్తు వేసుకుందాం— వస్తారూ?''

'ఏం ఆటలెద్దరూ....ఎప్పుడో ఆడాను — అయిన పేకాటంటే అదేదోలాగ వుంటుందండి''

''అదేమిటండీ ఈ రోజుల్లో పేరుకు లిటరరీ అసోసియేషన్లని పేరుగాని — రాత్రి పగలూ యిదేపని — పేకాట లేందే లోకానికి కల్చరే లేదు — ఏ ముహూర్తాన ఎవడు కనిపెట్టాడో గానీ ఇది యీనాడు ఇంటర్నేషనల్ గేమయి కూర్చుంది. మా కోనసీమలో చూశారూ.... పాలికాపు కుర్రాళ్లుకూడా ఏ చెట్టు క్రిందకో చేరి నాలుగాటలు ఆడుకోందే పశువులని తోలుకు రారు.''

''అయినా యిప్పుడెందుకులెద్దురూ — బిక్కూ బిక్కూ మంటూ యిద్దరంనూ.''

''ఇద్దరమేం ఖర్మం. మా మేనల్లుడొచ్చాడు పొద్దుట బండికి.... మా యింటి వుంది... గనుక వుబుసుపోడానికి.... రండే!''

అసలు పేకాటలోనే వుంది మజా — వచ్చే లీరాలి గాని— వచ్చుంటే అందులోనూ పేపస్తే ఆడననే వారుంటారా....పూర్వానికి వూరుమీద వూరు పడుతోన్నా అన్నట్లుగా జూలై పద్నాలుగో తారీఖున మహా ప్రళయం వస్తోందని ఆరోజు రోజల్లా ఆఖరి దఫా ఆటని క్లబ్బు తలుపులు బిగించుకొని ఆడుకొన్నారట....

ముందునాడే మన చేతిలో రెండు నోట్లు వచ్చిపడ్డాయేమో! జన్మానికల్లా శివరాత్రి ఈ ఒక్కసారి ఆడేశి యింకెప్పుడూ మళ్లీ ఈ పేక ముట్టుకోకూడదనుకొని — లోపలకు వెళ్లి రెండు నోట్లూ జేబులో వేసుగుని వచ్చి కూర్చున్నాను.

ఘంటలు కొట్టేస్తోంది ప్రతి పదినిముషాలకీ ఎదురుగా వున్న గడియారం — వేం అలా కూర్చునే వున్నాం వంటాడు టిఫిన్లు అందిచ్చాడు — కాఫీ యిచ్చాడు — మళ్లీ భోజనానికి పిలచాడు....

''ఈ పూటకు హోటలొద్దు — అన్నారు సుందరరావుగారు.''

ముందున్న ఆట రమ్మీ దృష్ట్యా నేనూ మొహమాటపడలేదు.

మెతుకులు ముక్కుకు రాసుగొచ్చి మళ్లీ కూర్చున్నాం.

సుందరరావుగారి భార్య — అబ్బ! యింక నిద్దరొస్తోందండీ అనేసరికి రాత్రి వంటి గంటయ్యింది — నా డబ్బుగాక పైగా రెండు నెల్ల జీతం వచ్చిపడింది.

వెధవది రాత్రనక పగలనక కూర్చుని చచ్చేటట్లు ఆరవచాకరీ చేసి — చిత్తం బత్తెం అయ్యా — అంటే నెలకోసారి చచ్చు తొంభై రూపాయలూ అరడజనుసార్లు లెక్కపెట్టి — పది నయాపైసాలు బిళ్లకోసం అని — అర్ధ రూపాయి ట్రెజరీ గుమస్తా మాటని — అర ణాలు — ఏదో దిబ్బో దిరుగుండవ్ అని మినహాయించుకొని మిగత యివ్వడనికి తనబాబు గారి మూట యిస్తోన్నట్లు ఏడుస్తూ యిస్తాడు కేషియరు.

జల్సాగా — జాలీగా — కాఫీ — టిఫిను, తిండీ పెట్టి — సరదాగా కబుర్లు చెప్తూ యిచ్చారు మహానుభావులు.

ఇంక ఎలాగైనా రోజూ ఒకటి రెండుగంటలు యిలా ఏదో ఆడుకుంటే కస్త రిక్రియేషనూ వుంటుందీ — పైగా యింట్లో నాలుగురాళ్లూ కనబడతాయి. అనుకుంటూ నెమ్మదిగా ఆవులించుకుంటూ వెళ్లి పడుకొన్నాను.

మర్నాటి నుంచీ రాత్రివేళ — సుందరరావు గారి భార్య రావటం లేదుగానీ — ఎవరో ఒకరు వస్తూనే వున్నారు — మా కాలక్షేపం నిక్షేపంలా జరుగుతూనే వుంది.

ఉంకో విశేషం ఏమిటంటూరా—! కొంచెం వూళ్లో పెద్దాఫీసరు చేతులో వుండటాన్ని బట్టి వూళ్లో పురజనుల మాట అలా వుండగా మావాడిమట్టుకు — మావాడు కొంచెం చీదరించుకోటంలేదు — మనం అంటే.

ఆ మధ్య ఆయనగారి కొడుక్కో చిన్న రికమండేషనుకూడా చేయించాను సుందరరావుగారి ద్వారా, అప్పటినుంచీ మనమీద గౌరవ మర్యాదలు అతిశయించ లంకించాయి.

అంత ముందుకు అప్పుడప్పుడు ఏకవచన ప్రయోగం దాకా కూడా పోనిచ్చిన పెద్దమనిషి చస్తే యిప్పుడు.... గారూ అనడం మానటం లేదు.

ఏతా వాతా — చెప్పొచ్చిందేమిటీ అంటే !

మావూరు పూర్తిగా పట్నం కాదు. పల్లె గాదూ అని ఆదిలోనే శలవిచ్చుకొన్నానుగదండీ — మధ్యరకం తప్ప రకం అన్నమాట.

''పోతే మెయ్యబోతే ఎద్దుల్లోకి చెయ్యబోతే దూడల్లోకి''.... అంటామే అక్షరాల నిజం.

కూరలు — పాలు — యిళ్ళు అద్దెలు వగైరా.... వగైరాలకు మాది పట్నవాసం సిటీ ప్రజా సౌకర్యాది కార్యాలకు కుగ్రామం. సరాండి.

కనుక !

ముఖ్యంగా మా వూళ్లో ఉన్నది ఒక్కగాని ఒక్క సినిమా హాలు — అందులోకి వచ్చే చిత్రాలుంటే సినీమాలు పూర్వం మూగ సినిమాల్లాంటివే అనడానికి సందేహం అక్కర్లేదు... వయస్సు మీరిన చిత్రాలు మధ్యలో రెండు మూడు నాలుగైదుసార్లు చచ్చిపోతూ వుంటాయి ఒక్క అర్ధగంటలో మళ్ళీ ఆపరేషను అవుతుంది లెండి.

ఒక్కొక్కప్పుడు ''ఆపరేషన్ — సక్సెస్ ఫుల్ పేషెంటు డైడ్''— అవుతూ ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటుకు కోపం ముక్కు చివరకీ కొస్తుంటుంది. ఫలితం ఆట రేపు చూపబడును.... షరా మామూలే!

కనుక.

మా వూళ్లో కళాపోషకులకు ఎప్పటికప్పుడు అప్ టు డేటు — తాజా — కళా సంకేతా కావలసివస్తే ముప్పావలా డబ్బులు టిక్కటు పెట్టుకొని — కారుమీద సమీప పట్నం చేరుకొని చూడ్డం తప్పిస్తే కాళా లేదు. నబోటిగాళ్ళం. అసలు అర్ధణా అందుకోసం ఆరణాలు — కాబట్టిన్నీ మా వూళ్లో మొదటి వారం కాంప్లిమెంటరీల పేచీలేదు గనుకనున్నా.. కళ్ళు మూసుకుని కుర్చీ ముందుకు కూచున్నట్టు మోకాళ్ళమీద గుళ్ళో ప్రార్థన చేసినట్లు సినీమా అయిందనిపించుకుంటాం!

పోతే!

ఆఫీసరుగార్కి ఆరునెల్లబట్టి ల్యాండు లార్డుం— పై పెచ్చు పేకాటలో సహచరులం కాబట్టి శ్రీవారు ప్రత్యేకం గవర్నమెంటువారి జీపుకారులో సినీమాకు వెళ్లే సందర్భంలో మనల్ని కూడా ఆహ్వానించారు — కాదు కాదు బలవంతం చేసారు — ఇంకా — నేనువస్తేకానీ తమరూ వెంచెయ్యమన్నారు — ఈతూరి ఆడాళ్లతో వెళ్ళటంలేదన్నారు.

పైపెచ్చు ఇంట్లో మనకి అప్పట్లో బాదర బందీ లేదు గనుక — సైయంటే సరేనన్నాను. చేసేదిలేక.

వచ్చినవాళ్లం — మళ్లీ ఎప్పటికో ఎన్నటికో అని — వరుసగా మూడూ చూసేసి అర్ధరాత్రి కాదు తెల్లవారుగట్ల మూడున్నర గంటలకు గృహప్రవేశం చేశాం. సుషుప్తిగాంచాం.

కాకులు కూసాయిగాబోసు — అప్పటికి ఒక్క గంటన్నర నిద్రకన్న ఎక్కువ కాలేదు. నిద్ర మంచం వదలేదుగాని వినిపిస్తున్నాయి.

''అడ్డమైనవాళ్లనీ— తీసుకువెళ్లొచ్చు ఇలా తగలేస్తోంటే ఇంక సంసారం సాగినట్టే''

వాళ్ళకేం — అన్నివిధాలా వాళ్ళ దోస్తున్నారు — తెచ్చిందికూడా వాళ్ళకే యిసేసరి —

అనుకుంటూ మళ్ళీ కునుకు తీసి ఆనాడు శలవుగాబట్టి తొమ్మిదింటికి లేచి — ముఖ ప్రక్షాళన వగైరాలు కనిచ్చి — భోజనం వండుకోవటానికి ఒద్దకించి — హోటలుకు పోయి భోంచేసివచ్చి — మళ్ళీ నడుంవాల్చి మూడుగంటలకు లేచేసరికల్లా ఆఫీసర్జీ తలుపు తోసుకు ప్రత్యక్షమై ఆనెల పూర్తిగా అవ్వందే కూడా అద్దె బాపతు సొంతం నాచేతిలో పెట్టి సాయంకాలం యిల్లు ఖాళీచేస్తున్నాం అన్నాడు.